సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 13 । జూలై । 2024



'స్మార్ట్'గా దోచేస్తారు

ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల ముసుగులో సైబర్ నేరగాళ్లు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని, వ్యక్తిగత సమాచారం సైతం దోపిడీ చేస్తున్నారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. 8లో ▸



మొక్కజొన్నలో మెలకువలు

ఖరీఫ్ మొక్కజొన్న సాగులో విత్తన ఎంపిక, సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ **శాఖ అధికారులు** సూచించారు. 8లో ▸



ప్రమాదకర స్థితిలో ప్రభుత్వాస్పత్రి

పాలకొల్లు ప్రభుత్వాస్పత్రి ప్రమాదకరంగా మారడంతో ముందస్తు చర్యల్లో భాగంగా చికిత్స మధ్యలోనే రోగులను ఇంటికి పంపించివేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

మురుగు కాలువలను ప్రక్షాళన చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు

భీమవరం: కాలువల పూడికతో మురుగునీరు పారక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. గునుపూడి–తాడేరు మురుగు కాలువను తక్షణమే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం శివారు తాడేరు వంతెన వద్ద కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గునుపూడి మురుగు కాలువ గుర్రపుడెక్క, కిక్కిసతో నిండిపోయిందని, దీంతో మురుగు నీరు పారక సుమారు 10 వేల ఎకరాల్లో పంట దెబ్బతింటుందన్నారు. ప్రస్తుతం కొద్దిపాటి వర్షానికే నీరు లాగకపోవడంతో వందలాది ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు తక్షణం స్పందించకుంటే క్రాప్ హాలీడే ప్రకటిస్తామని హెచ్చరించారు. రైతులు కర్రా అచ్యుతరావు, మట్టా ఏసు, పూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెం వెల్‌నెస్ కేంద్రానికి కేంద్ర గుర్తింపు



కేంద్ర బృందంతో వైద్యులు, సిబ్బంది (ఫైల్)

మొగల్తూరు: రామన్నపాలెం–1 సచివాలయ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (వెల్‌నెస్ సెంటర్) కేంద్ర ప్రభుత్వ జాతీయ నాణ్యత హామీ ప్రమాణ పత్రం సాధించిందని ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఓ.దినేష్, కె.లక్ష్మీపార్వతి శుక్రవారం తెలిపారు. గతనెలలో ఢిల్లీలోని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన (ఎన్‌కాస్) జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ బృందం వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి వసతులు, సేవలు, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధిని యంత్రణ, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారన్నారు. అనంతరం కేంద్రానికి 89.74 మార్కులు ఇవ్వగా ఉన్నతాధికారులు జాతీయ నాణ్యత హామీ ప్రమాణ పత్రాన్ని అందించారన్నారు. కేంద్ర గుర్తింపుపై సర్పంచ్ బందెల ఏలీషా, ఉప సర్పంచ్ మేకల పరుశురామ్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు తగవు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శాంతి స్వరూప్

అత్తిలి: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలవారిపాలెంలో ఆత్మహత్యకు పాల్పడిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి న్యాయం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్ కోరారు. శుక్రవారం ఆయన అత్తిలిలో మాట్లాడుతూ సదరు ఫీల్డ్ అసిస్టెంట్ 18 ఏళ్లుగా సక్రమంగా విధులు నిర్వర్తించారని, కొందరు అధికారులు, నాయకులు కలిసి విధులకు అడ్డుతగలడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేధింపులు ఆపకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. జిల్లా నాయకులు రమేష్, మహేష్‌రెడ్డి, ఏసురత్నం, కోటి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావాసులకు ఇసుకను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రివర్ కన్జర్వేటర్, గనుల శాఖ అధికారులతో ఆమె ఇసుక సరఫరాపై సమీక్షించారు. అనుమతులు పొందడంలో తాత్సారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలి, నరసాపురం గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఐదు డీసిల్టింగ్ పాయింట్లను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే కొత్త డీసిల్టింగ్ పాయింట్లను గుర్తించాలన్నారు. గోదావరి రివర్ కన్సర్వేటర్ విశ్వేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోకో ధర పతనం

రైతులు విల'వెల'

- 50 శాతం మేర తగ్గిన ధర
- ఫిబ్రవరిలో కిలో రూ.1,050
- ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500
- ఉమ్మడి జిల్లాలో 39 వేల ఎకరాల్లో సాగు
- ఏడాదికి 12 వేల టన్నుల దిగుబడి
- కొత్తగా అందుబాటులోకి 18 లక్షల మొక్కలు



పామాయిల్ సాగులో అంతరపంటగా ఉన్న కోకో

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చాక్లెట్ల తయారీలో కీలకంగా వినియోగించే కోకో పంట ధర తిరోగమనం బాట పట్టింది. గతేడాది నుంచి షేర్ మార్కెట్‌లో పోటీపడుతూ రికార్డు స్థాయిలో పెరిగిన ధర ప్రస్తుతం 50 శాతం మేర క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతర దేశాల పంట అందుబాటులోకి రావడం, పలు కారణాలతో దేశంలో కోకోకు గిరాకీ తగ్గింది. అయితే దీర్ఘకాలం దిగుబడి వచ్చే పంట కావడం, పెట్టుబడులు తక్కువగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కిలో కోకో రూ.1,050 ధర పలకగా ప్రస్తుతం కిలో రూ.450 నుంచి రూ.500 మధ్య సాగుతోంది.

హెక్టారుకు రూ. 20 వేల సబ్సిడీ

ఏలూరు జిల్లాలో 35,324.33 ఎకరాల్లో, పశ్చిమ గోదావరి జిల్లాలో 4 వేల ఎకరాల్లో కోకో సాగు ఉంది. కోకో సాగుకు హెక్టారుకు రూ.20 వేల సబ్సిడీని ఉద్యాన శాఖ అందిస్తోంది. దీనిలో భాగంగా మొక్కలు, ఎరువుల కోసం మొదటి ఏడాది రూ.12 వేలు, రెండు, మూడు సంవత్సరాల్లో రూ.4 వేల చొప్పున ఇస్తున్నారు. 4వ ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 35 ఏళ్ల వరకు మంచి దిగుబడులు ఉండటంతో పాటు మొక్క జీవితకాలం 40 ఏళ్లు. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏటా 2 లక్షల టన్నుల కోకో అవసరం కాగా ఉత్పత్తి మాత్రం 30 వేల టన్నులు ఉంది. దానిలో అత్యధిక శాతం ఏలూరు జిల్లా కాగా కేరళ, కర్ణాటక నుంచి మిగిలిన దిగుబడి ఉంది. తమిళనాడులో మూడేళ్ల నుంచి కోకో సాగు మొదలైంది.

అంతర పంటగా సాగు : జిల్లాలో ఉద్యాన పంటల్లో ఆయిల్‌పామ్ అగ్రస్థానంలో కొనసాగుతుంది. ప్రధానంగా ఆయిల్‌పామ్, కొబ్బరిలో అంతర పంటగా కోకోను పండిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్‌పామ్ కంటే కోకోకు ఎక్కువ డిమాండ్ ఉంది. గతేడాది ఫిబ్రవరిలో కిలో కోకో ధర రూ.240 పలకగా ఈ ఏడాది అదే సమయంలో రూ.1,050కు చేరింది. తాజాగా జూన్ నుంచి తిరోగమన బాటపట్టి కిలో రూ.450 నుంచి రూ.500కు చేరింది. కోకో ఎగుమతులు తగ్గడం ధరల పతనానికి కారణంగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోకోను ప్రోత్సహించడానికి గత మూడేళ్లుగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. సాగైన కోకోను నిల్వ చేయడానికి వీలుగా జిల్లాలో మినీ కోల్డ్ స్టోరేజీలు, కోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలాగే డ్రైయింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తోంది.

ఎగుమతులు లేవు : జిల్లాలో సగటున ఏడాదికి 12 వేల టన్నుల కోకో దిగుబడి వస్తుంది. కొబ్బరిలో అంతర పంటగా ఉండే కోకో సగటున 3 నుంచి 4 క్వింటాళ్లు, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా ఉన్న కోకో సగటున 1 నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లా నుంచి ప్రస్తుతం ఎలాంటి ఎగుమతులు లేవు. స్థానిక మార్కెట్ అవసరాలకే దిగుబడి సరిపోని పరిస్థితి. ప్రధానంగా జిల్లాలో హిందుస్థాన్ లీవర్, క్యాడ్బరీస్‌తో పాటు మరో రెండు చాక్లెట్ల కంపెనీలు కోకో పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ధర మరో రెండు, మూడు నెలలు కొనసాగే అవకాశం ఉంది.

పెరుగుతున్న విస్తీర్ణం

అంతర పంట కావడంతో మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కోకో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మూడేళ్లలో 3 వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం పెరిగింది. ఏటా సగటున వెయ్యి హెక్టార్లు పెరుగుతుండగా ఈ ఒక్క ఏడాదే 2 వేల హెక్టార్లు పెరుగుతుందన్న అంచనా వేసి దానికి అనుగుణంగా 15 లక్షల మొక్కలను అధికారులు అందుబాటులోకి తీసుకురాగా, రైతులు, యూనివర్సిటీ సహకారంతో మరో 3 లక్షల మొక్కలు అందుబాటులో తెచ్చారు.

దీర్ఘకాలిక పంట



అంతర పంటగా ఉన్న కోకో మంచి లాభాలు ఇస్తుంది. భవిష్యత్‌లో 30 ఏళ్లకుపైగా మంచి డిమాండ్ ఉంది. దేశీయ చాక్లెట్ల కంపెనీ అవసరాల్లో 30 శాతం కూడా స్థానికంగా ఉత్పత్తి జరగని పరిస్థితి. దీంతో రానున్న కాలంలో అంతర పంటగా సాగును మరింత ప్రోత్సహిస్తాం.

– రామ్మోహన్, డీడీ, ఉద్యాన శాఖ

జలశక్తి అభియాన్ పనుల పూర్తికి చర్యలు

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జలశక్తి అభియాన్ అమల్లో ఎంపిక చేసిన పనులను చేపట్టి పూర్తి చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృందం సభ్యులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్–ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డా.జితేంద్ర సింగ్‌తో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో చేపట్టిన పనులను వివరించారు. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర నోడల్ బృందం మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనుందన్నారు. జిల్లాలో పనులను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. దీనిలో భాగంగా తొలిరోజు కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించామన్నారు. మొగల్తూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం మండలాల్లో 17 పనులను సందర్శించి వేతనదారులు, రైతులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కేంద్ర నినాదం 'నారీ శక్తి సే జలశక్తి'ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహిళల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ జలశక్తి అభియాన్ కింద కాలువలు, డ్రెయిన్‌లో పూడిక తీత పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ శాస్త్రవేత్త మౌనిక, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధీర్ బాబు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీపీఓ విక్టర్, ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం



పాలకోడేరు హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. వర్షాకాల సీజన్‌లో వ్యాధులు ప్రబలుతాయని ఆరోగ్య నియమాలు పాటించాలని ఆమె సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. జిల్లా మధ్యాహ్న భోజన కో–ఆర్డినేటర్లు కె.కృష్ణారావు, జి.చిన్నయ్య, డీవైఈఓ నక్కా శ్రీనివాస్, ఎంఈఓలు వేంద్ర వెంకటేశ్వరరావు, పీఏఎస్ నాగరాజు, హెచ్ఎం పి.మహేష్‌బాబు ఉన్నారు.

టిడ్కో ఇళ్లను త్వరితగతిన అందించాలి

కలెక్టర్ నాగరాణి



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో చివరి దశ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టిడ్కో ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో జిల్లాలో టిడ్కో నిర్మాణాల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 19,872 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, వాటిలో 8,736 నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారన్నారు. మిగిలిన 11,136 నిర్మాణాల్లో 4,668 నిర్మాణాలు 90 శాతం పైగా పూర్తికాగా, 6,368 నిర్మాణాలు 95 శాతానికిపైగా పూర్తయ్యాయని తెలిపారు. నూరు శాతం పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. భీమవరంలో 8,352 ఇళ్ల నిర్మాణాలకు 2,944 ఇళ్లను, తాడేపల్లిగూడెంలో 5,376 నిర్మాణాలకు 3,232 ఇళ్లను, పాలకొల్లులో 6,144 నిర్మాణాలకు 2,560 ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు అందించారన్నారు. అలాగే 8,736 ఇళ్లకు సంబంధించి డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. భీమవరంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 2,944 ఇళ్లకు గాను 960 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాల్సి ఉందని, ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తి కావచ్చాయన్నారు. అలాగే భీమవరం టిడ్కో సముదాయానికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంఎస్ స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్లు ఎం.శ్యామల, డి.మురళీకృష్ణ, పార్థసారథి, ఎల్ అండ్ టీ ప్రతినిధి మణికంఠన్, టిడ్కో ఏఈలు, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో సిద్ధం కండి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రాధాన్యత అంశాలకు సంబంధించి స్పష్టతతో కూడిన సమగ్ర సమాచారంతో ఈనెల 15న జరిగే జిల్లాస్థాయి సమావేశానికి సిద్ధం కావాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశం ముందస్తు ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై పూర్తి సమాచారం అందించే దిశగా సిద్ధం కావాలన్నారు. ఆయా శాఖల వారీగా పెండింగ్ పనులు, తాగునీటి వ్యవస్థ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ, వైద్యారోగ్య సేవలు, వ్యవసాయ, వాటి అనుబంధ శాఖలు, పారిశుధ్యం నిర్వహణ, విద్య, రహదారులు, ఉపాధి కల్పన అంశాలపై సమీక్షించారు.

వరదలపై అప్రమత్తం: గోదావరి నది ఎగువన వర్షాలు కురుస్తున్నందున వరద పెరిగే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖలు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన కార్యాచరణతో సిద్ధం కావాలన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

మూడు రోజులుగా విద్యుత్ సరఫరాలో వస్తున్న అంతరాయాలపై ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజును కలెక్టర్ ఆరా తీశారు. దీనిపై సమగ్ర తనిఖీ నిర్వహించాలన్నారు. పత్రికల్లో ప్రచురితమవుతున్న ప్రతికూల వార్తలపై స్పందిస్తూ సకాలంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రలోభాలకు గురికావద్దని యువతకు సూచించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ పంచాయతీల్లో స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

టీఎల్ఎఫ్ ఆర్పీపై వేటు

సాక్షి స్పందన

నూజివీడు: పట్టణంలోని స్వయం సహాయక సంఘాల నుంచి ఆడిట్ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్న వ్యవహారంపై టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) ఆర్పీని వెంటనే తొలగించాలని ఆదేశించినట్టు మెప్మా పీడీ బి.ఇమ్మానియేలు శుక్రవారం తెలిపారు. ఆడిట్ పేరుతో పట్టణంలోని స్వయం సహాయక సంఘాల నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్న విషయమై గతనెల 30న 'సాక్షి'లో 'ఆడిట్ పేరుతో అదనపు వసూళ్లు' శీర్షికన కథనాన్ని ప్రచురించగా పీడీ విచారణ జరిపారు. ఆడిట్ నిమిత్తం రూ.250 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని ఆడిటర్ తెలిపిన తర్వాత అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించామని పీడీ తెలిపారు. అలాగే టీఎల్ఎఫ్ బాడీ ఆదేశాల మేరకు ఆర్పీని విధుల నుంచి తొలగించామన్నారు.

కానిస్టేబుల్‌కు 'డీజీపీ' అవార్డు



జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ

బుట్టాయగూడెం: ప్రతిష్టాత్మకమైన డీజీపీ కమాండేషన్ డిస్క్ అవార్డును బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.బాలకృష్ణ పొందారు. జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి చేతులమీదుగా శుక్రవారం అవార్డు పత్రాన్ని అందుకున్నారు. పోలీస్ శాఖలో అందించిన ఆదర్శవంతమైన సేవ, అత్యుత్తమ పనితీరు, వృత్తిపరమైన నైపుణ్యం, వృత్తి పట్ల అంకితభావాన్ని గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. బాలకృష్ణను పలువురు అభినందించారు.

భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారం, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలన్నారు. అలాగే విద్యార్థుల్లో పోషకాహార లోపాలను అధిగమించేందుకు మధ్యాహ్న భోజన మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు.

ఈదురు గాలులు.. భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నేలకొరిగిన చెట్లు
- జిల్లాలో 353 మి.మీ వర్షపాతం



ఆకివీడులో నీటమునిగిన రోడ్డు



తణుకు మండలం దువ్వలో జలమయమైన జెడ్పీ హైస్కూల్ ఆవరణ

ఆకివీడు: ఈదురుగాలులు, భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కుండపోతగా విరుచుకుపడింది. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రోడ్లు జలమయమయ్యాయి. నారుమడులు నీటమునిగాయి. ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో భారీ వర్షం కురిసింది. ఆకివీడు మండలంలోని అజ్జమూరు, కుప్పనపూడి, తాళ్లకోడు, ఆకివీడు, అయిభీమవరం, పాలకోడేరు మండలం విస్సాకోడేరు, ఉండి మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో సాయంత్రంలోపు విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.

వేగంగా దమ్ము పనులు : ఖరీఫ్ సాగుకు నీటి ఎద్దడి ఏర్పడింది. పంట కాలువల ద్వారా అంతంతమాత్రంగా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్నా పంట కాలువల్లోకి చొచ్చుకురావడంలేదు. ఉండి, వెంకయ్య వయ్యేరు పంట కాలువలకు నీరు అంతంతమాత్రంగా విడుదల చేస్తున్నారు. కాలువల నుంచి సుమారు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తేనే దమ్ము పనులు పూర్తవుతాయని రైతులు అంటున్నారు. ఈ క్రమంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షం నారుమడులకు మేలు చేస్తుందని, దమ్ము పనులు వేగంగా చేసుకునేందుకు వీలు కలిగిందని రైతులు అంటున్నారు.

జిల్లాలో 353.8 మి.మీ వర్షపాతం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం 353.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు సమాచార శాఖ తెలిపింది. గణపవరం మండలంలో అత్యధికంగా 35.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పాలకొల్లులో 30.4, తణుకులో 30.2, ఆకివీడులో 29.2, తాడేపల్లిగూడెంలో 23.2, పెంటపాడులో 20.6, మొగల్తూరులో 19.2, పెనుగొండలో 19.4, ఇరగవరం, కాళ్లలో 18.2 మి.మీ వర్షం కురిసింది. అత్తిలిలో 15.8, పెనుమంట్రలో 11.2, నరసాపురంలో 10.8, ఆచంటలో 10, పోడూరులో 9.4, యలమంచిలిలో 6.2, ఉండిలో 14.4, పాలకోడేరులో 13.4, వీరవాసరంలో 10, భీమవరంలో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

'తల్లికి వందనం'పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు



విద్యార్థులకు కిట్‌లు అందిస్తున్న మంత్రి నిమ్మల

యలమంచిలి: తల్లికి వందనం పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక తాళ్లూరి నారాయణస్వామి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతున్న పిల్లలందరికీ ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేస్తోందన్నారు. ముందుగా కొంతేరులో ఆవ డ్రెయిన్‌లో తూడు తొలగింపు పనులను ఆయన ప్రారంభించారు. కాజ పడమర గ్రామంలో అగ్ని ప్రమాదాల్లో నష్టపోయిన ముగ్గురు రైతులకు దాతల సాయంతో రూ.65 వేలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

శాకంబరీ అలంకరణలో వడలమ్మ



నిడమర్రు : శ్రావణ మాసం సందర్భంగా బువ్వనపల్లి గ్రామ దేవత శ్రీవడలమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వడలమ్మ అమ్మవారిని 250 కిలోల కూరగాయలతో అలంకరించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ గ్రామంలోని మహిళలు ఆషాఢ మాస సారెను ప్రధాన ఆలయంలోని అమ్మవారికి సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

హైవేపై హల్‌చల్



జాతీయ రహదారిపై పడగవిప్పి బుసకొడుతున్న నాగుపాము

కై కలూరు : పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి గోనెపాడు వద్ద నాలుగు అడుగుల నాగుపాము శుక్రవారం హల్‌చల్ చేసింది. ఉదయం 10.30 గంటలకు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో నాగుపాము రోడ్డుపైకి వచ్చింది. రోడ్డు మధ్యలో తోక్పై పడగవిప్పి బుసలు కొట్టింది. దగ్గరకు వెళ్ళడానికి ఎవరూ సాహసించలేదు. దీంతో ఇరువైపుల ట్రాఫిక్ 20 నిమిషాలు నిలిచిపోయింది. నాగుపాము రోడ్డు సమీప పొదల్లోకి వెళ్లడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



తణుకు : తణుకు రైల్వే స్టేషన్‌లో గత మూడ్రోజులుగా తిరుగుతూ అస్వస్థతకు గురైన గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 60 ఏళ్లు కలిగిన వృద్ధురాలు గురువారం అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రమణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 70939 39777 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

స్మార్ట్‌గా దోచేస్తారు

- ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లతో జాగ్రత్త
- గేమ్స్‌కు బానిసైతే బుక్కైనట్టే
- లూటీ అవుతున్న బ్యాంకు ఖాతాలు
- వ్యక్తిగత సమాచారం సైతం దోపిడీ



వీరవాసరం: భీమవరానికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగి విజయ్ ఫోన్‌కు తన ఖాతాలోంచి రూ. 10 వేల నగదు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఒక్కసారిగా ఉలికిపడి చెక్ చేస్తే.. తన ఫోన్‌లో గేమ్ ఆడిన కొడుకు.. ఆ గేమ్‌కు సంబంధించి మరిన్ని ఫీచర్లు కావాలంటే డబ్బులు కట్టాలంటూ వచ్చిన మెసేజ్‌ను క్లిక్ చేశాడు. ఇంకేముంది ఆ లింక్ క్లిక్ చేయగానే యూపీఐ యాప్‌లోకి వెళ్లగా రూ.10 వేలు మాయమయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉంటుందో లేదోనని సంశయంతో కంప్లైంట్ చేయకుండా ఉండిపోయాడు. ఇటీవల ఇలాంటి కేసులు ఎక్కువయ్యాయి. స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసవుతున్న చిన్నారుల్ని ఆసరాగా చేసుకుని గేమింగ్ యాప్‌లు ఖాతాల్లోని డబ్బులు మాయం చేస్తున్నాయి. ప్రత్యేకించి చిన్నారులు, విద్యార్థులు, ఇటీవల కాలంలో ఫోన్లతో గడుపుతూ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతుఉన్నారు. దీని వల్ల ముప్పు తప్పదని పోలీసులు, మానసిక వైద్యులు స్పష్టం చేస్తున్నారు. విచ్చలవిడిగా గేమ్స్ ఆడుతూ డబ్బు నష్టపోవడంతో పాటు.. అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందు ఫ్రీ.. తర్వాత ఉచ్చులోకి..

గేమింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసే వరకు ఆయా సంస్థలు ఫ్రీ అనే భ్రమలోనే చిన్నారులు, యువతను ఉంచుతున్నాయి. కొన్ని యాప్స్ మరో అడుగు ముందుకేసి గేమ్ ఆడండి–డబ్బులు గెలవండి అనే ఆఫర్లు ఇస్తాయి. ఈ నేపథ్యంలో చిన్నారులు, యువత తొలుత ఈ యాప్స్‌కు అలవాటు పడుతున్నారు. కొన్ని రోజుల తరువాత ఫ్రీ వెర్షన్ అయిపోతుంది. ఇంకా ఆడాలన్నా... ఆట వస్తువులు కొనాలన్నా డబ్బులు చెల్లించాలంటూ ప్రొవెర్షన్ ఫోన్ స్క్రీన్ మీదకు తీసుకొస్తారు. అప్పటికే గేమ్‌కు బానిసయినవారు డబ్బులు చెల్లించి గేమింగ్ యాప్‌ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. చిన్నారులు, యువత బ్యాంకు ఖాతాల్లో నగదు ఉండకపోవడంతో వారి తల్లిదండ్రుల ఫోన్లకు ఆటాచ్ అయిన యూపీఐ (ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం) యాప్స్ నుంచి సులువుగా గేమింగ్ యాప్స్‌కు నగదు బదిలీ చేస్తున్నారు. ఈ విషయం తెలియని పెద్దవారు ఖాతాల్లో నగదు పోయినట్లు సైబర్ పోలీసులకు ఫిర్యాదులిస్తున్న ఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువగా నమోదవుతున్నాయి.

వ్యక్తిగత సమాచారం దోపిడీ

ఆన్‌లైన్‌గేమ్స్‌లో అపరిచితులతో ఆడేటప్పుడు.. జరిగే చాట్, గ్రూపు కాల్ ద్వారా సైబర్ నేరగాళ్లు మన ప్రొఫైల్ సేకరిస్తారు. అప్పుడప్పుడు జరిగే స్క్రీన్ షేరింగ్ ద్వారా బ్యాంకు ఖాతా, పాస్‌వర్డ్ వంటి వివరాలు తెలుసుకొని బ్యాంకు ఖాతాల నుంచి నగదు దోపిడీ చేస్తారు. మీ వ్యక్తిగత వివరాల ఆధారంగా ఇంటి అడ్రస్ తెలుసుకొని లాటరీ తగిలిందని...నగదు చెల్లిస్తే రూ.కోట్లు మీ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తామని నమ్మించి మోసానికి పాల్పడతారు. మీ గ్యాలరీలోని కుటుంబ సభ్యుల ఫోటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్‌కు దిగుతారు.

ఎవరిని ఆశ్రయించాలి

ఆన్‌లైన్ గేమింగ్‌లో చిక్కుకుని తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు పోగొట్టుకున్న బాధితులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. పరువు పోతుందని బాధపడుతూ కూర్చోకుండా పోలీసులకు జరిగిన సంఘటన వివరంగా తెలియజేయాలి.

1903 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి



బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ అయిన 24 గంటల లోపు పోలీసులను ఆశ్రయిస్తే ఆ సొమ్మును తిరిగి రాబట్టేందుకు చాలా అవకాశం ఉంటుంది. సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా 1903 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

– కొండవీటి శ్రీనివాసకుమార్, ఏలూరు సీఐ

అత్యంత ప్రమాదం



ఆన్‌లైన్ గేమ్స్ చిన్నారులు, యువత మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ గేమ్స్ ఆడేవాళ్లకు విపరీతంగా కోసం వస్తుంది. ఏకాగ్రత కోల్పోతారు. చదువుపై శ్రద్ధ తగ్గిపోతుంది. నిత్యం ఏకాంతంగా ఉండాలనే కోరుకుంటారు. నలుగురితో కలవరు. డిప్రెషన్ పెరిగిపోతుంది. శారీరక సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చాలా రోజులు పడుతుంది.

– యు.నవనీత్, కొణితివాడ పీహెచ్‌సీ డాక్టర్

కవి ప్రసాద్‌కు అంతర్జాతీయ అవార్డు



తణుకు : అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పర్యావరణానికో మొక్క నాటుదాం అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో 350 మంది కవులు పాల్గొనగా ఈ బహుమతికి ఎంపికయ్యారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కంటైనర్



ఆశ్రం- సోమవరప్పాడు హైవేపై డివైడర్‌ను ఢీకొట్టిన కంటైనర్

దెందులూరు : జాతీయ రహదారిపై ఆశ్రం–సోమవరప్పాడు మధ్య శుక్రవారం విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ సెంట్రల్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు, లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





● మేం మారమంతే!

ప్రాణం కంటే వీరికి సెల్‌ఫోన్‌లో మాట్లాడడమే ముఖ్యం. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడకూడదని అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు పెట్టి మొత్తుకున్నా.. జరిమానాలు విధించినా వీరి తీరు మారడం లేదు. ఏలూరు రద్దీ రోడ్లలో ఇలా ప్రమాదకరంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. వీరి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవడమే కాకుండా ఇతరులకు ప్రమాదకరంగా మారుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు







ప్రమాదకరంగా ప్రభుత్వాసుపత్రి

- పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి నుంచి పలువురు రోగుల డిశ్చార్జ్
- బాలింతలు వేరే భవనంలోకి మార్పు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రమాదకరంగా మారింది. ముందస్తు చర్యల్లో భాగంగా రోగులను ఇంటికి పంపించేశారు. అధికారుల ఆదేశాల నేపథ్యంలో రాత్రికి రాత్రి తమ సరంజామా సర్దుకుని పేషెంట్లు, వారి సహాయకులు ఆసుపత్రి బయట పడిగాపులు కాశారు. ఆసుపత్రి మొత్తం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. ఆసుపత్రి మధ్యలో శ్లాబ్ పడిపోతుండడంతో కొన్నేళ్లుగా అటు వైపు వెళ్లకూడదని బల్లలు అడ్డుపెట్టారు. ఆచంట, పిట్టల వేమవరం, లిఖితపూడి, నరసాపురం వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది పేషెంట్లు ఆసుపత్రిలో ఉన్నారు. బాలింతల కోసం రెండు వార్డులు ఉన్నాయి. ఒక వార్డులో శ్లాబ్ పడిపోయి వర్షం కారుతోంది. దీంతో బాలింతలను పక్క వార్డులోకి మార్చారు. ఆపరేషన్ చేయించుకున్న బాలింతలు వార్డు మారడానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రిలో ప్రస్తుతం 18 మంది బాలింతలు, 17 మంది శిశువులు ఉన్నారు.

ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లగలం: రోగులు

లిఖితపూడి నుండి ఓ వృద్ధురాలు గ్యాస్ నొప్పితో రాగా.. వైద్యం చేస్తుండగానే ఇంటికి వెళ్లిపోమనడంతో.. భర్త, మనవరాలి సహకారంతో నడుచుకుంటూ వెళ్లిపోయింది. కాలుకు నీరు పట్టడంతో ఆచంట నుంచి వచ్చిన వడ్లపాటి నతానియేలు కాలుకు కట్టు కట్టారు. శనివారం డిశ్చార్జి చేస్తామని చెప్పారు. అంతలోనే అప్పటికప్పుడు వెళ్లిపోవాలని చెప్పారు. ఇద్దరం వృద్ధులమేనని.. ఇప్పటికప్పుడు ఎక్కడికి, ఎలా వెళ్లగలమని ప్రశ్నించారు.



ఆసుపత్రి బయట వేచి ఉన్న రోగి వడ్లపాటి నతానియేలు



బాలింతల్ని వేరే వార్డుకు తరలిస్తున్న దృశ్యం



ఊడిపడుతున్న ఆసుపత్రి శ్లాబ్

సెలైన్ పెడతామన్నారు.. అంతలోనే వెళ్లిపోవాలన్నారు

ఆచంటకు చెందిన చింతపల్లి మంగ అనే మహిళకి కత్తి గాయాలవడంతో.. ఆదివారం ఆస్పత్రిలో చేరింది. ఆమెకు వైద్యం అందించిన సిబ్బంది.. డిశ్చార్జి చేయాలని భావించగా, కడుపులో నొప్పిగా ఉందని చెప్పడంతో సాయంత్రం 6 గంటలకు సెలైన్ పెడతామని, బాటిల్ తెచ్చుకోమని చెప్పారు. సెలైన్ పెట్టిన అనంతరం.. భవనం ప్రమాదకరంగా ఉంది.. వెంటనే వెళ్లిపోవాలని చెప్పారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఆమె ఆస్పత్రి బయటికి వచ్చింది.

ప్రమాదకరంగా శ్లాబులు

ఆసుపత్రి భవనం శ్లాబ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. శుక్రవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూర్యనారాయణ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రి శ్లాబ్‌లు చాలా వీక్‌గా ఉన్నాయని, మరింత వర్షం వస్తే ప్రమాదం ఉందని, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో అత్యవసరం అనుకున్న పేషెంట్లకు నరసాపురం, ఆచంట, పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద వైద్యం అందించడానికి ముందస్తుగా ఆదేశాలిచ్చారు. డిశ్చార్జ్ చేసే పేషెంట్లను ఇంటికి పంపించాలని సూచించారు. వైద్యం పొందుతున్న పేషెంట్లను ఆసుపత్రి భవనంలో బాగున్న వార్డులకు మార్చాలని చెప్పారు. దీంతో డిశ్చార్జ్ అయ్యే పేషెంట్లను పంపించి, బాలింతలను పక్క వార్డుల్లోకి మార్చాం.

– డాక్టర్ రవికుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, పాలకొల్లు

తల్లిదండ్రుల పట్ల అంకితభావం ఉండాలి



భీమవరంలో ప్రవచనం చెబుతున్న గరికపాటి నరసింహారావు

భీమవరం (ప్రకాశంచౌక్): 20 ఏళ్ల వయసులో తాడేపల్లిగూడెం నుంచి భీమవరానికి నాటకాల కోసం సైకిల్‌పై వచ్చేవాడినని, ఈ ప్రాంతానికి వస్తున్నానంటే ఎంతో ఆనందంగా ఉండేదని.. ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహరావు అన్నారు. బొండాడ సుబ్బారావు దశమ వర్ధంతి సందర్భంగా స్థానిక త్యాగరాజ భవనంలో శుక్రవారం గరికపాటి ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గరికపాటి, ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. హిందూ పురాణమైన రామాయణంలో శ్రవణ కుమారుడు కథ ఒక ఉదాత్తమైన పాత్ర అని, తల్లిదండ్రుల పట్ల ఎంత అంకిత భావాన్ని కలిగి ఉండాలో చెప్పే ఒక మహోన్నత వ్యక్తిత్వమని అన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ కంటికి కనిపించే ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను బాగా చూసుకుంటే కంటికి కనిపించని దైవం తప్పకుండా హర్షిస్తాడని అన్నారు. కార్యక్రమంలో ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి కనకరాజు, వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి



తణుకులోని బ్యాడ్మింటన్ అకాడమీలో చాంపియన్‌షిప్ పోటీల దృశ్యం

తణుకు టౌన్: బ్యాడ్మింటన్ క్రీడల్లో జాతీయ స్థాయికి చేరిన తణుకు ప్రాంతానికి చెందిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి కోరారు. శుక్రవారం తణుకులోని శ్రీచిట్టూరి సుబ్బారావు, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే జిల్లా బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తణుకు బ్యాడ్మింటన్ అకాడమీ నుంచి జాతీయ స్థాయిలో విజేతలైన హేమంత్, మనోజ్ఞలను అభినందించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడాకారులు స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. ఈ పోటీల క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మెంటే వంశీ కృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులు ఈ పోటీలలో తమ క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యుడు కేఎస్ఆర్‌వీ ప్రసాద్, కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనా సాయి తదితరులు మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది పాల్గొంటారని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.సతీష్ బాబు తెలిపారు.

ఖరీఫ్ మొక్కజొన్నలో మెలకువలు



మెట్టలో రైతులు సాగు చేస్తున్న ఖరీఫ్ మొక్కజొన్న



చింతలపూడి: మొక్కజొన్న పంటను వర్షాధారంగా, సాగునీటి కింద పండిస్తున్నారు. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా దాణా రూపంలో పశువులకు మేతగా, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా, పేలాల పంటగా, కాయగూరగా సాగు చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో 48 వేల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఏటా 4.40 లక్షల టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , సాగు వివరాలను వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ రైతులకు సూచించారు.

విత్తే సమయం

సాధారణంగా జూన్ 15 నుంచి జూలై లోగా విత్తుకోవాలి. వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రిడ్ రకాలు ఆగస్టు రెండో వారంలో కూడా విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

- దీర్ఘకాలిక రకాలు (100–120)రోజులు: డీహెచ్ఎం -113, 900 ఎంగోల్డ్, బయో 9861, ప్రో–311, 30బి07
- మధ్య కాలిక రకాలు (90–100 రోజులు): డిహెచ్ఎం–111, 117, 119, కెహెచ్–510, బయో– 9657, కెఎం–9541, ఎంసిహెచ్–2
- స్వల్పకాలిక రకాలు (వీటి కాల పరిమితి 90 రోజుల కంటే తక్కువ): డీహెచ్ఎం–115, ప్రకాశ్ కెహెచ్–5991, జెకెఎంఎచ్–1701–డికెసి–7074ఆర్, ఎంఎంఎచ్–1701, డికెసి–7074ఆర్, ఎంఎంఎచ్–133, 3342

ప్రత్యేక రకాలు

తీపి మొక్కజొన్న(స్వీట్ కార్న్): మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, ఆల్మోరా స్వీట్ కార్న్, సుగర్–75, బ్రైట్‌జీన్ సంకర రకాలు.

విత్తేవిధానం

ఎకరాకు సంకర రకాలైతే 7–8 కిలోల విత్తనం వాడి 60 సెంటీమీటర్లు ఎడంగా బోదెలు చేసి సాళ్ళలో 20 సెంమీ ఎడంగా విత్తాలి. ఇలా విత్తితే ఎకరాకు సుమారు 33,333 మొక్కలు వస్తాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం.45 చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.

ఎరువుల వాడకం

ఖరీఫ్ పంటలో ఎకరాకు 72–80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వాడాలి. మొత్తం పొటాష్, భాస్వరం ఎరువులను పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒకవేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ (20గ్రా) పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏకపంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800–1200 గ్రా, అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2–3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపు నివారించవచ్చు. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ

పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొల్చే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10–12 రోజులకు పైరుపై మోనోక్రొటోఫాస్(1.6 మి.లీ) లేదా కోరా.ఎస్ (0.3 మిలీలీటర్) నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25–30 రోజుల దశలో ఆకు సుడుల్లో వేయాలి. ఆకుమాడు తెగులు నివారణకు మాంకోజెబ్(2.5 గ్రా) లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పాడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2–3 ఆకులు తుంచివేసి ప్రొపికొనజోల్ (1 మి.లీ) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్కఎండు, కాండం మసికుళ్ళు తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్తగా వాటిని ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి , వేసవిలో లోతు దుక్కులు, పూత దశ తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు చూసుకోవాలి.

క్లుప్తంగా

జాతీయ సదస్సుకు కరుణశ్రీ



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ

తాడేపల్లిగూడెం : హైద్రాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్ మెంటులో దేశంలోని విశ్వవిద్యాలయాల విస్తరణ సంచాలకుల సమావేశానికి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు హాజరయ్యారు. నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. వినూత్నంగా నిర్వహిస్తున్న ఆర్య, సమీకృత వ్యవసాయ విధానాలు, గ్రామాల దత్తత, సంచార సేవలు, అంతర్జాల సేవలు గురించి ఈ సమావేశంలో మాట్లాడారు. శనివారంతో ఈ సదస్సు ముగియనుంది.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం, దండగర్ర, కడియద్ద గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్లు, పనులు కొలతలను సాంకేతిక సహాయకులతో కలిసి తనిఖీ చేశారు. కూలీలకు సకాలంలో కూలి సొమ్ములు వస్తున్నది? లేనిది అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు జే.థామస్, కే.సుమలత, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఉన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం సందర్భంగా అన్న సమారాధన జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి రవి శంకర్ పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు వెలవలపల్లి ప్రదీప్ శర్మ, గోపీనాథ్ శర్మ, బాదంపూడి మల్లిఖార్జునశర్మలు బ్రహ్మత్వంలో అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గురుకుల విద్యార్థులకు సీట్ల కేటాయింపు



ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా నిర్వహించే శ్రేష్ఠ పరీక్షలో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 139 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా వీరిలో 15 మందికి మొదటి విడత కౌన్సిలింగ్‌లో సీట్లు కేటాయించారని ప్రిన్సిపల్ బి.రాజారావు శుక్రవారం తెలిపారు. 12మందికి కేరళ, ముగ్గురికి ఆంధ్రాలోనూ ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల్లో సీట్లు లభించాయన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీసీవో ఎస్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు అభినందించారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ, ట్రాఫిక్ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెడ్ వాడకంపై అవగాహన నిర్వహించారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో హెల్మెట్ లేకుండా మోటారు సైకిల్ నడుపుతున్నవారికి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగ్గళ్ల వెంకట రమణారావు, భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు మోటారుసైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వై.నాగలక్ష్మి, న్యాయవాదులు ఉండవల్లి రమేష్ నాయుడు, వీవీ సుబ్బారావు, ఎస్ సుధీర్, పి.అంబేద్కర్, డి.రవికిరణ్, కె.జ్యోతి పాల్గొన్నారు.

దారి కాచిన ప్రమాదం!

- రోడ్డుపక్కనే వాహనాల పార్కింగ్
- ట్రావెల్స్ బస్సులదీ అదే తీరు
- నిత్యం ప్రమాదాలకు ఆస్కారం



తేతలి వైజంక్షన్ హైవేపై నిలిపిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

తణుకు: నేషనల్ హైవేపై రోడ్డుపక్కనే నిలిపి ఉంచిన లారీని ఢీకొన్న సంఘటన..... ఆగి ఉన్న వాహనాన్ని తప్పించబోయి కాల్వలోకి దూసుకెళ్లిన మరో సంఘటన... ఇలా జాతీయ రహదారి నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో రక్తసిక్తమవుతోంది. తణుకు పట్టణాన్ని ఆనుకుని వెళుతున్న చెన్నై-కోలకత్తా జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల కారణంగా ప్రతి ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మరోవైపు ఏలూరు జిల్లాలో తాజాగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రధానంగా రోడ్డు పక్కనే నిలిపి ఉంచిన వాహనాల కారణంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల అధికారులు సైతం నిర్ధారించారు. ఇటీవలి కాలంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సైతం నడిరోడ్డుపైనే బస్సులను ఆపి ప్రయాణీకులను ఎక్కించుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ తంతు నడుస్తోంది. తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డుతో పాటు సొసైటీ రోడ్డు, శర్మిష్ట జంక్షన్, తేతలి వైజంక్షన్ ఇలా రద్దీగా ఉండే ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. ఇలాంటి వాహనాలకు అడ్డుకునేందుకు రవాణా, పోలీసు శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిపోతున్నాయి.

అడుగడుగునా లోపాలు...

చెన్నై నుంచి కోలకత్తా వరకు నాలుగు లేన్లలో విస్తరించిన 16వనెంబరు జాతీయ రహదారి తణుకు మండలం దువ్వ నుంచి సుమారు 12 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీగా ఉంటోంది. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా పట్టణం, గ్రామాలు విస్తరిస్తుండటంతో రోడ్డు దాటేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా సెంటర్లలో నిర్వహణలోపం నిర్వహణ లోపం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా జాతీయర రహదారిపై ప్రమాదాలు నివారించడానికి ఏర్పాటు చేసిన సూచికలు, హెచ్చరిక బోర్డులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పాటు ఆయా సెంటర్లలో బస్సులు, ఇతరత్రా వాహనాలు నిలిపేందుకు బస్‌బే పేరుతో స్థలం వదలాల్సిండగా ఎక్కడా ఇలాంటి చర్యలు తీసుకోలేదు. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహన చోదకులు విశ్రాంతి తీసుకోవడానికి ప్రతి 40 కిలోమీటర్లుకు 5 ఎకరాల చొప్పున స్థలం కేటాయించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. దువ్వ సమీపంలోని వెంకయ్య వయ్యేరు, దువ్వ జంక్షన్, తేతలి గ్రామ జంక్షన్, తేతలి జంక్షన్, అయ్యప్పస్వామి దేవాలయం జంక్షన్, శర్మిష్ట జంక్షన్, ఉండ్రాజవరం జంక్షన్, పెరవలి వైజంక్షన్ తదితర ప్రాంతాలను ప్రమాదకర జంక్షన్లుగా గుర్తించారు. అయితే ఆయా జంక్షన్లలో రోడ్డు పక్కనే వాహనాలు ఉంచుతుండటంతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ట్రావెల్స్ దందా

హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగళూరు, ముంబాయి వంటి పట్టణాలకు నిత్యం తణుకు పట్టణం మీదుగా ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం సుమారు 20 నుంచి 30 వరకు బస్సులు పట్టణంలోకి వచ్చి వెళుతుండగా మరో వందకు పైగా బస్సులు హైవే మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తణుకు పట్టణంలోని పలువురు ట్రావెల్స్ యజమానులు బుక్కింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్ రద్దీగా ఉండే సమయాల్లో ముఖ్యంగా రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ప్రధాన రోడ్లపై ట్రావెల్స్ బస్సులు నిలిపి ప్రయాణీకులను ఎక్కిస్తున్నారు. ముఖ్యంగా వెంకటేశ్వరస్వామి దేవాలయం, టౌన్‌హాల్ కాంప్లెక్స్, సొసైటీ రోడ్డులోని కామధేను కాంప్లెక్స్, శర్మిష్ట సెంటర్, తేతలి వైజంక్షన్ సెంటర్లలో నిత్యం పదుల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిలుపుతున్నారు. మరోవైపు హైవేపై సైతం ట్రావెల్స్ బస్సులు విచ్చలవిడిగా నిలుపుతుండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఇస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో ఇలా బస్సులు నిలుపుతుండగా వేగంగా వచ్చే వాహనాలు గుర్తించలేకపోతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల తణుకు-పైడిపర్రు ఫ్లైవర్ బ్రిడ్జిపై ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.

వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు చెప్పారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీని ఆయన సందర్శించారు. ఉద్యోగులకు, రైతులకు, ఉపయుక్తంగా ఉండే కార్యక్రమాల నిమిత్తం ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. మరో 30 రోజుల్లో వర్సిటీని సందర్శిస్తానని, అప్పటికి వర్సిటీ పూర్తి వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ పద్మావతమ్మ, గేదెల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.ఆనందరావు వర్సిటీ అధికారులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులను పొందాలి

ఇరగవరం: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులను పొందాలని మండల వ్యవసాయాధికారి వై రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తు పలు సూచనలు చేశారు. కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులకు పంట నష్టం, వ్యవసాయ యాంత్రీకరణ, రాయితీపై విత్తనాలు పొందవచ్చన్నారు. గత ఏడాది కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సర్వే నెంబరుపై కాకుండా ల్యాండ్ పార్సిల్ నెంబరుపై ఇస్తారన్నారు. కౌలు గుర్తింపు కార్డు కావలసిన రైతులు సమీపంలోని వీఆర్వోను, లేదా రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలన్నారు.

తక్కువ ధరకు నిత్యావసరాలు



నిత్యావసర వస్తువుల విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న సివిల్ సప్లై అధికారులు

అత్తిలి: ప్రజలకు తక్కువ ధరకు నిత్యావసరాలు అందించాలనే ప్రభుత్వ నిర్ణయంతో అత్తిలి ఛాంబర్ ఆఫ్ కామర్సు భవనంలో విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేసామని ఛాంబర్ ఆఫ్ కామర్సు అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు తెలిపారు. అధిక ధరలతో సతమతమౌతున్న ప్రజల ఇబ్బందులను గమనించి స్టీమ్డ్ బీపీటీ రైస్ కిలో రూ. 49లకు, పచ్చి బీటీపీ రైస్ కిలో రూ. 48లు, దేశవాళీ కంది పప్పు కిలో రూ. 160లకు ఈకౌంటర్ ద్వారా విక్రయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరాం ప్రసాద్, తూనికలు, కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ నాగరాజు, డీఎస్‌ఓ సరోజ, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్సు కార్యదర్శి ఎం సత్యనారాయణ, జనసేన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దిరిశాల వెంకట్, దాసరి నాగరాజు, కొనకళ్ల కాంతారావు, రైస్, కిరాణా వర్తకులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో ఇబ్బందులు



దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీటిలో తరగతి గదులకు వెళ్తున్న విద్యార్థులు



దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గది వరకూ వర్షపు నీరు చేరిన దృశ్యం

తణుకు టౌన్: తణుకు పట్టణంలో భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. నారుమడులు నీటమునిగాయి. తణుకు నియోజకవర్గంలోని రూరల్ మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ సాగుకు నీటి ఎద్దడి ఏర్పడింది. పంట కాలువల ద్వారా అంతంతమాత్రంగా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు: పట్టణంలో వార్షిక మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తణుకు పట్టణంతో పాటు తణుకు, అత్తిలి మండలాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. తణుకు అర్బన్ పరిధిలో ఎన్జీవో కాలనీ, అజ్జరం కాలనీ, ఉండ్రాజవరం జంక్షన్, టి.వేమవరం, కొండాలమ్మపుంత, శివాలయం సంతమార్కెట్ ప్రాంతాలతో పాటు దువ్వ సబ్ స్టేషన్ పరిధిలోని దువ్వ, కోనాల, ముద్దాపురం, కొమ్మర సబ్‌స్టేషన్ పరిధిలోని కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, సీహెచ్ చెరువు, స్కిన్నెరపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. మాధవరం సబ్ స్టేషన్ పరిధి మాధవరం, ఉప్పరగూడెం, జగ్గన్నపేట సబ్ స్టేషన్ పరిధి జగ్గన్నపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని ఫీడర్లు మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం వెల్లడించారు. వన్‌టౌన్‌లోని మెయిన్ రోడ్డు, శేషమహల్ రోడ్డు ఏరియా, మునిసిపల్ ఆఫీస్, రైల్వే స్టేషన్ రోడ్డు, భూపాల్ నగర్, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏరియా ఆసుపత్రి, సత్యవతి నగర్, మామిడితోట, గాంధీ బొమ్మ సెంటర్, హౌసింగ్‌బోర్డు, ఎఫ్‌సీఐ కాలనీ, వీకర్స్‌కాలనీ, కోతి బొమ్మ సెంటర్‌ల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. టూ టౌన్ సౌత్ సెక్షన్ యాగర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కొబ్బరితోట, రామచంద్రరావుపేట, యాగర్లపల్లి, సీతారామపేట, జట్లపాలెం, పడాల, ముత్యాలంభపురంలో సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న భవిత సెంటర్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరి రక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భవిత సెంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులచే భవిత సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ సంచులు వాడకం మానేయలని, నార సంచులు ఉపయోగించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు, ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలైన ఫీవర్ సర్వేలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు, ర్యాలీలు శుక్రవారం వీకర్స్‌కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లోని 1, 2, 3 వార్డుల్లో జరిగాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు పెరగకుండా నివారణ కోసం నీటి నిల్వలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాలానుగుణ వ్యాధులను సులువుగా అరికట్టవచ్చు అని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ సాధారణ జ్వరం ఉంటే అశ్రద్ధ చేయకూడదని సర్వే బృందాలు వచ్చినప్పుడు జ్వరాలపై హెల్త్ సిబ్బందికి ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మీప్రసన్న, పవన్ కుమార్, రాము, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భవితలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

సీజనల్ వ్యాధులపై స్థానిక భవిత సెంటర్‌లో అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. బయట అమ్మే తినుబండారాలు తినరాదని, శీతల పానీయాలు తాగవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఉపాధ్యాయుని కుమారి, పూర్ణ, రత్నకుమారి, నాగలక్ష్మి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో తీవ్ర నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. భీమవరం మండలం నాగేంద్రపురం గ్రామంలో సీపీఐ మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమల యాజమాన్యం సిండికేట్ ఏర్పడి చేపలు, రొయ్యలను తక్కువ ధరకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. వనామీ రొయ్య 100 కౌంట్‌కు రూ.250 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్సిడీ, రాయితీపై మేత సరఫరా చేసి నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేయాలన్నారు. ఆక్వా పరిశ్రమల్లో దినసరి మహిళా కూలీలకు కనీస వేతనం రూ.650 అమలు చేయాలన్నారు. దాళ్వా ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సార్వా పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవీఎస్ బ్రహ్మం, సీపీఐ మండల కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, నాగిడి తులసీ రావు, నాగిడి నాగరాజు, ఎన్. శ్రీనివాస్, నాగిడి రాము, వాటాల పెంటయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి

ఆకివీడు: వ్యాధులు ప్రబలకుండా, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని డీడీఓ ఆనంద్ భూషణం విజ్ఞప్తి చేశారు. మండలంలోని మందపాడులో శుక్రవారం పారిశుద్ధ్య పనుల్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో చెత్త రోడ్లపై పారవేయవద్దన్నారు. ఇళ్లల్లోని మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూడాలన్నారు. మురుగు నీటికి గుంతలు తవ్వుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లోని మురుగునీటి నిల్వలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లలిత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండి: ఈదురు గాలుల కారణంగా శుక్రవారం ఉదయం ఉండిలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది అధికారుల చొరవతో పలు గ్రామాల్లో సుమారు ఉదయం 8 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఉండిలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన ఏర్పరచుకోవాలి



కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల బృందం

కాళ్ల: విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి కంప్యూటర్ విద్యపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు పేర్కొన్నారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ ఫౌండేషన్ పేరిట ఎక్స్‌ప్లోరింగ్ కంప్యూటర్ బ్రెయిన్ అండ్ ఎంఎస్ ఆఫీస్ పేరిట 3 రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల తమ పాఠశాల విద్యార్థుల ఉన్నతికి అందిస్తున్న సహాయ సహకారాలకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కోఆర్డినేటర్ పి భువనేశ్వరి వెల్లడించారు. పూర్ణచంద్ర, అంజన, హర్షిత, శ్రీవల్లి పాల్గొన్నారు.

పౌష్టికాహారం గర్భిణికి అదనపు బలం



యండగండి పీహెచ్‌సీ వద్ద పౌష్టికాహారంపై ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉండి: గర్భిణులు తీసుకునే పౌష్టికాహారం ఆమెకు అదనపు బలమని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఐసీ కీర్తన అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, తదితర పథకాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలో తమ పేరు నమోదు చేసుకోవడమే కాకుండా స్కానింగ్, రక్త పరీక్షలు చేయించుకుని ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలని అన్నారు. పుట్టిన పిల్లలకు ఇమ్యూనైజేషన్ చేయించుకోవాలని అన్నారు. అలా చేసిన వారికి రూ.11 వేలు ప్రభుత్వం నుంచి అందుతాయన్నారు. రెండవ కాన్పులో రూ.5 వేలు వస్తాయని, రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6 వేలు ఇస్తారని అన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణీకి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రక్తం ఎక్కిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, పలువురు గర్భిణులు పాల్గొన్నారు.